www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 | సంచిక: 135 | హైదరాబాద్ | ఆదివారం | 03-08-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## కాంగ్రెస్ DNAలోనే మోసం ఉంది



**హైదరాబాద్ ఆగస్టు 02 (సిద్దిపేట పవర్):**

బీఆర్ఎస్ ఎమ్మెల్యే మరోసారి కాంగ్రెస్ పై సంచలన ఆరోపణలు చేసారు. కాంగ్రెస్ నిర్వహించిన బీసీ కులగణన తప్పుల తడకగా ఉందని విమర్శించారు. ముస్లింలు, బీసీలు, కలిపి 56 శాతం ఉండాలి.. కానీ రేవంత్ రెడ్డి 42 శాతమే ఇచ్చారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా బీసీ రిజర్వేషన్లు అమలు చేయవచ్చునని అన్నారు. కానీ కాంగ్రెస్ దానిని చేయదని, ప్రజలను మరోసారి మోసం చేసేందుకు సిద్ధం అయిందని, కాంగ్రెస్ DNAలోనే మోసం ఉందని మండిపడ్డారు. కాంగ్రెస్ బీజేపీపై ఒత్తిడి చేయకుండా.. పోరాటం చేసే మాపై విమర్శలు చేస్తే ఏంవస్తుందన్నారు.

ఆత్మగౌరవం ముఖ్యమని జైలు జీవితం నేర్పించిందని, జైల్లో స్వయంగా పేదల కష్టాలను చూశానని, బెయిల్ కోసం డబ్బులు లేక నెలల తరబడి జైల్లో మగ్గుతున్నవారిని చూశానన్నారు. జైలుకు వెళ్లే ముందే బీసీ ఇష్యూని తీసుకున్నాని, పూలే విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై పెట్టాలని కేసీఆర్ నిర్ణయించారు కానీ టెక్నికల్ సమస్యల వల్ల విగ్రహ ఏర్పాటు ఆగిందన్నారు. బీఆర్ఎస్‌లో నేను లైఫ్ టైమ్ మెంబర్‌నని, కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు కూడా మహిళా బిల్లు కోసం ఢిల్లీలో ఆందోళన చేశానని గుర్తు చేసారు. మా మధ్య అభిప్రాయబేధాలే తప్ప బేధాభిప్రాయాలు లేవన్నారు. లేఖ లీక్ చేసిందెవరో చెప్పాలన్నదే తన డిమాండ్ అని, వాళ్లను పట్టుకునేవరకు దూరంగా ఉండాలనుకున్నట్లు కవిత పేర్కొన్నారు.

---

సైబర్ సెక్యూరిటీ దూకుడు: 228 మంది నిందితులు అదుపులోకి

₹92 కోట్ల మోసం బహిర్గతం చేసిన సైబర్ నేర దర్యాప్తు

ఫేక్ కాల్ సెంటర్లు, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్‌లతో దేశవ్యాప్తంగా ఉచ్చులు

ప్రజలకు హెచ్చరిక: సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండండి



# సైబర్ నేరాలపై పెద్ద ఎత్తున ఆపరేషన్.. 228 మంది అరెస్ట్

**హైదరాబాద్ ఆగస్టు 03(సిద్దిపేట పవర్):**

తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో సైబర్ నేరాలపై తన దూకుడు కొనసాగిస్తోంది. 2025 సంవత్సరంలో ఇప్పటివరకు మొత్తం 228 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. వీరు దేశవ్యాప్తంగా 1,313 కేసుల్లో నిందితులుగా ఉన్నారని, వాటిలో 1,089 కేసులు తెలంగాణకే

...మిగతా 2లో

---

# కేసీఆర్ లేకుంటే నల్గొండ లిల్లీపుట్ ఎవరు?

బీఆర్ఎస్‌లో తారాస్థాయికి చేరిన నేతల మధ్య విభేదాలు

మాజీ మంత్రి జగదీశ్ రెడ్డిపై ఎమ్మెల్సీ కవిత తీవ్ర స్థాయిలో విమర్శలు

జగదీశ్ రెడ్డి ఓ 'లిల్లిపుట్' అని, కేసీఆర్ లేకపోతే ఆయనెవరని వ్యాఖ్య

తనపై కొందరు పార్టీ నేతలే కుట్ర చేస్తున్నారని కవిత ఆరోపణ

కవిత వ్యాఖ్యలకు జగదీశ్ రెడ్డి ఘాటుగా బదులు, సెటైర్లు

కేసీఆర్ శత్రువుల మాటలను కవిత వాడుతున్నారని జగదీశ్ రెడ్డి ఆరోపణ



**హైదరాబాద్ ఆగస్టు 03(సిద్దిపేట పవర్):**

బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిపై పరోక్షంగా విరుచుకుపడ్డారు. జగదీశ్ రెడ్డిని 'లిల్లిపుట్ ' అంటూ సంబోధించిన కవిత, కేసీఆర్ నీడలో బతికే ఆయనకు సొంత అస్తిత్వం లేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. దీనిపై జగదీశ్ రెడ్డి కూడా అంతే స్థాయిలో స్పందిస్తూ సెటైరికల్ కౌంటర్ ఇచ్చారు.

ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడిన కవిత, తనపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేస్తున్న అనుచిత వ్యాఖ్యల వెనుక బీఆర్ఎస్‌లోని కొందరు ముఖ్య నేతల హస్తం ఉందని సంచలన ఆరోపణలు చేశారు. "పార్టీలోని ఒక అగ్రనేత ప్రోద్బలంతోనే నాపై ఇలాంటి వ్యాఖ్యలు చేయిస్తున్నారు. అందుకే బీఆర్ఎస్ నేతలు ఎవరూ దీనిపై మాట్లాడటం లేదు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. జగదీశ్ రెడ్డిని ఉద్దేశిస్తూ, "కేసీఆర్ అనే నీడ లేకపోతే మీరెవరు? నల్గొండ జిల్లాలో పార్టీని నాశనం చేశారు. తర్వాత పార్టీలో చేరిన ఓ చిన్న నేత కూడా నా విశ్వసనీయతను

...మిగతా 2లో

---



# టీడయాగ్నోస్టిక్స్‌కు నిధుల్లేవ్!

కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకంపై నిర్లక్ష్యం

పేదరోగులకు ఉచితంగా 134 పరీక్షలు

బీఆర్ఎస్ హయాంలో విజయవంతం

పేదల ఆరోగ్యాన్ని గాలికొదిలేసిన కాంగ్రెస్ సర్కార

**హైదరాబాద్ ఆగస్టు 03(సిద్దిపేట పవర్):**

పార్టీ ప్రభుత్వానికి పేదల వైద్యం పట్టడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉచిత వైద్య పరీక్షలను అందించేందుకు 2018లో కేసీఆర్ సర్కారు ప్రవేశపెట్టిన 'టీడయాగ్నోస్టిక్స్'పై రేవంత్‌రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్యమే ఇందుకు నిదర్శనమని ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వ దవాఖానలలో పరీక్షలు అందుబాటులో లేక.. ప్రైవేటు డయాగ్నోస్టిక్ సెంటర్లకు వెళ్లి, వేలాది రూపాయలు ఖర్చు పెట్టుకోవాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వైద్యపరీక్షల పరికరాల నిర్వహణకు కూడా ప్రభుత్వం నిధులు ఇవ్వడంలేదని తెలుస్తున్నది.

**మరీ ఇంత అధ్వానమా!**

టీ డయాగ్నోస్టిక్స్ పథకం చాలా జిల్లాల్లో అధ్వానంగా ఉందని వైద్యశాఖలోనే చర్చ జరుగుతున్నది. పరీక్షలు చేసే యంత్ర పరికరాల నిర్వహణకు కావాల్సిన రసాయనాల కొనుగోలుకు కూడా ప్రభుత్వం నిధులు ఇవ్వడంలేదని తెలుస్తున్నది. వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ జిల్లాల్లో కలెక్టర్లు తమ అత్యవరసర నిధి నుంచి కెమికల్స్ తెప్పించుకునే పరిస్థితి నెలకొన్నదని అధికారులు వాపోతున్నారు. కొన్ని పరీక్షా కేంద్రాల్లో 80 రకాల పరీక్షలు మాత్రమే చేస్తున్నారు.

సూర్యాపేటలో థైరాయిడ్, ఎలక్ట్రోలైట్స్, గ్రూపింగ్ కిట్స్, ప్రెగ్నెన్సీ టెస్ట్ కిట్లు, కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్, గుండె పరీక్షలు, బ్రెస్ట్ క్యాన్సర్ పరీక్షలు అందుబాటులోలేవని అధికారులు వివరిస్తున్నారు. సిద్ధిపేటలో బయోకెమిస్ట్రీ కెమికల్ లేకపోవడంతో జూన్‌లో సాధారణ వైద్య పరీక్షలు కూడా నిలిచిపోయాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో థైరాయిడ్ ప్రొఫైల్ టెస్టులకు వాడే కెమికల్ అందుబాటులో లేదు. అదిలాబాద్ నుంచి కెమికల్ తీసుకువచ్చి వారానికోసారి పరీక్షలు చేస్తున్నారు.

**పేదల కోసం.. కేసీఆర్ ఆలోచన**

కేసీఆర్ ప్రభుత్వం హైదరాబాద్ నారాయణగూడలోని

...మిగతా 2లో

---

ఎన్నికల సంఘం పిలుపు...

## ఢిల్లీకి కేటీఆర్ బృందం

ఆగస్టు 5న ఈసీఐ సమావేశానికి హాజరుకానున్న బీఆర్ఎస్

కేటీఆర్ నేతృత్వంలో ఢిల్లీకి వెళ్లనున్న ప్రతినిధి బృందం

ఎన్నికల సంస్కరణలు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై చర్చ

బీఆర్ఎస్ పెండింగ్ వినతులపైనా చర్చించే అవకాశం

ఓటర్ల జాబితా సవరణ వివాదం నేపథ్యంలో భేటీకి ప్రాధాన్యత



2

## కేసీఆర్ వల్లే ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు చేపట్టింది

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ సంచలన ఆరోపణ

రాయలసీమను రతనాల సీమ చేస్తానన్న కేసీఆర్‌ను గుర్తుచేసిన వైనం

తెలంగాణ ప్రయోజనాలను కేసీఆర్ విస్మరించారని తీవ్ర విమర్శ

నిజామాబాద్ జిల్లా కార్యకర్తల సమావేశంలో వ్యాఖ్యలు



2

## చుక్క నీరు వదలం

రాజకీయాల కంటే రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం

ఏపీ కుట్రలు, కుతంత్రాలను అడ్డుకుంటాం

బనకచర్ల పాపం ముమ్మాటికి బీఆర్ఎస్‌దే

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



2

## బనకచర్ల ప్రాజెక్టుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం

బనకచర్ల ప్రాజెక్టును ఆపడానికి కాంగ్రెస్ సంకల్పం

కాళేశ్వరం న్యాయపర రిపోర్టు రేపు క్యాబినెట్లో

రైతులకు నీళ్లు అందించడంలో బీఆర్ఎస్ వైఫల్యం

కొత్త రిజర్వాయర్లతో చివరి పంట వరకూ నీళ్లు హామీ : మంత్రి ఉత్తమ్



2



## మెట్రో రైల్ కారిడార్ పనులు వేగవంతం

ఎంజీబీఎస్-చంద్రాయన్‌గుట్ట మార్గంలో రోడ్ విస్తరణ వేగవంతం

ఆస్తుల ప్రభావం తగ్గిస్తూ అలైన్మెంట్‌లో నూతన మార్పులు

పిల్లర్ల మార్కింగ్, భూసామర్థ్య పరీక్షలకు సన్నాహాలు ప్రారంభం

యుటిలిటీల మార్పు, అండర్‌గ్రౌండ్ విద్యుత్ లైన్లపై సమన్వయం

**హైదరాబాద్ ఆగస్టు 03 (సిద్దిపేట పవర్):**

ఎంజీబీఎస్ నుండి చంద్రాయన్‌గుట్ట మధ్య మెట్రో రైల్ కారిడార్ ఏర్పాటుకు సంబంధించిన రోడ్ విస్తరణ పనులు వేగవంతం అయ్యాయి. ఏడున్నర కిలోమీటర్ల మార్గంలో అలైన్మెంట్ అద్భుతంగా ఉండేలా చర్యలు చేపట్టామని, ఈ మార్గంలో రోడ్ విస్తరణ వల్ల ప్రభావితం అయ్యే ఆస్తుల సంఖ్యను తగ్గించేలా

...మిగతా 2లో

## కేసీఆర్ లేకుంటే నల్గొండ
# లిల్లీపుట్ ఎవరు?

మొదటిపేజీ తరువాయి



ప్రశ్నించే స్థాయికి వచ్చారు" అని మండిపడ్డారు.

తనను ఒంటరిని చేసి, పక్కన పెట్టాలని చూస్తున్నారని, అయితే కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతానని, చేసిన వారికి తగిన ఫలితం దక్కుతుందని కవిత అన్నారు. కొద్ది నెలల క్రితం కేసీఆర్‌కు రాసిన లేఖ లీక్ అయిన నాటి నుంచి కవిత అసంతృప్తితో ఉన్న విషయం తెలిసిందే. "కేసీఆర్ ఒక దేవుడు, కానీ ఆయన చుట్టూ రాక్షసులు చేరారు" అని ఆమె గతంలో చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తుచేశారు.

**కవిత వ్యాఖ్యలపై జగదీశ్ రెడ్డి స్పందన**

కవిత చేసిన తీవ్ర వ్యాఖ్యలపై మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కూడా ఎక్స్ వేదికగా ఘాటుగా స్పందించారు. "నా ఉద్యమ ప్రస్థానానికి సంబంధించి కవితమ్మకు ఉన్న జ్ఞానానికి నా జోహార్లు. కేసీఆర్ శత్రువులైన రేవంత్, రాధాకృష్ణ లాంటి వారు నా గురించి మాట్లాడిన మాటల్ని ఆమె మరొక్కసారి వల్లె వేసేందుకు చేసిన ప్రయత్నానికి నా సానుభూతిని తెలియజేస్తున్నా" అంటూ ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

# టీ-డయాగ్నోస్టిక్స్‌కు నిధుల్లేవ్

మొదటిపేజీ తరువాయి

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ ప్రధాన హబ్‌గా టీ డయాగ్నోస్టిక్స్ ఏర్పాటు చేసింది. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించింది. నారాయణపేట, మేడ్చల్ మల్కాజిగిరి మినహా అన్ని జిల్లాల్లో 32 మైక్రోబయోలజీ, పాథాలజీ, బయోకెమిస్ట్రీ ల్యాబ్స్‌తో కూడిన హబ్స్‌ను ఏర్పాటు చేసింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలు, పల్లె దవాఖానాలు, కమ్యూనిటీ సెంటర్లలో 1,546 చోట్ల స్పోక్స్(చిన్న కేంద్రాలు)ను నెలకొల్పింది. ఫలితాలు వెంటనే వచ్చే టెస్టులను స్పోక్స్‌లలో, ఫలితాలకు సమయం పట్టే పరీక్షలను హబ్‌లలో నిర్వహించేలా చర్యలు చేపట్టింది. షుగర్ నుంచి క్యాన్సర్ వరకు 134 రకాల పరీక్షలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు అప్పుడు ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు ప్రత్యేక చొరవ చూపారు.



# కేసీఆర్ వల్లే ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు చేపట్టింది

- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ సంచలన ఆరోపణ
- రాయలసీమను రతనాల సీమ చేస్తానన్న కేసీఆర్‌ను గుర్తుచేసిన వైనం
- తెలంగాణ ప్రయోజనాలను కేసీఆర్ విస్మరించారని తీవ్ర విమర్శ
- నిజామాబాద్ జిల్లా కార్యకర్తల సమావేశంలో వ్యాఖ్యలు



**హైదరాబాద్ ఆగస్టు 03(సిద్దిపేట పవర్):**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వల్లే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణ ప్రయోజనాలను పణంగా పెట్టి, పొరుగు రాష్ట్రానికి లబ్ధి చేకూర్చేలా కేసీఆర్ వ్యవహరించారని ఆయన తీవ్రంగా విమర్శించారు.

"గోదావరిలో 3 వేల టీఎంసీల మిగులు జలాలు ఉన్నాయి, వాటిని ఏపీ వాడుకోవచ్చు" అని గతంలో కేసీఆరే స్వయంగా చెప్పారని గుర్తుచేశారు. తెలంగాణను పక్కనపెట్టి, రాయలసీమను రతనాల సీమగా మారుస్తానని కేసీఆర్ హామీ ఇచ్చారని, ఆయన మాటలతోనే ఏపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు విషయంలో ముందుకు వెళ్లిందని స్పష్టం చేశారు. ప్రస్తుతం తమ ప్రభుత్వంపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

నిజామాబాద్ జిల్లాలో చేపట్టిన జనహిత పాదయాత్రలో భాగంగా జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ గ్రామంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మహేశ్‌కుమార్ గౌడ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

# బనకచర్ల ప్రాజెక్టుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం

- బనకచర్ల ప్రాజెక్టును ఆపడానికి కాంగ్రెస్ సంకల్పం
- కాలేశ్వరం న్యాయపర రిపోర్టు రేపు క్యాబినెట్లో
- రైతులకు నీళ్లు అందించడంలో బీఆర్ఎస్ వైఫల్యం
- కొత్త రిజర్వాయర్లతో చివరి పంట వరకూ నీళ్లు హామీ : మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్ ఆగస్టు 03(సిద్దిపేట పవర్):**

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పలు కీలక వ్యాఖ్యలు చేశారు. బనకచర్ల ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ వైఖరిని స్పష్టంచేస్తూ, "మా రిపోర్టుల వల్లే ఈ ప్రాజెక్ట్ ఆగింది, మా రిపోర్టర్‌ల కృషితోనే కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్ట్‌ను ఆపింది" అని ఆయన పేర్కొన్నారు. బనకచర్ల ప్రాజెక్టు రాష్ట్రానికి అనర్థం తెస్తుందని హెచ్చరిస్తూ, "దాన్ని ఆపడానికి కాంగ్రెస్ పార్టీ ఎంతటి సాహసానికైనా సిద్ధం" అని హామీ ఇచ్చారు.

బీఆర్ఎస్ నాయకుల వ్యాఖ్యలపై స్పందించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి, "ప్రధాన పదవుల్లో ఉన్నవారు బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారు" అని విమర్శించారు. కాలేశ్వరం ప్రాజెక్టుపై వచ్చిన న్యాయపరమైన రిపోర్టును రేపు కేబినెట్‌లో ప్రవేశ పెడతామని ప్రకటించారు. "ఆ రిపోర్టు బయటపడ్డాక బీఆర్ఎస్ నాయకుల పరిస్థితి ఏమవుతుందో చూడాలి" అని అన్నారు.

రాహుల్ గాంధీ తీసుకున్న నిర్ణయాలను ప్రస్తావిస్తూ, "40 ఏళ్లుగా ఒకే పార్టీ జెండా పట్టుకున్న లక్ష్మణ్ కుమార్‌ను ఎమ్మెల్యేగా ఎన్నుకోవడమే కాకుండా మొదటిసారి ఎన్నికై మంత్రిగా చేసిన ఘనత రాహుల్ గాంధీదే" అని తెలిపారు.

గోదావరి నది పక్కనే ఉన్నా రైతులకు పంటలకు నీళ్లు అందించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. "లక్ష్మీ నరసింహస్వామి రిజర్వాయర్‌తో పాటు పట్టిపాక రిజర్వాయర్‌ను నిర్మిస్తాం. రైతుల చివరి పంట వరకూ నీళ్లు అందించే బాధ్యత మేమే తీసుకుంటాం, నిధులు మంజూరు చేస్తాం" అని హామీ ఇచ్చారు.

## మెట్రో రైల్ కారిడార్
# పనులు వేగవంతం

మొదటిపేజీ తరువాయి

మార్గాన్ని రూపకల్పన చేశామని హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు.

మెట్రో పనులకు సంబంధించి ఇంజినీరింగ్, రెవిన్యూ అధికారులతో రోజు వారీ సమీక్షలు నిర్వహిస్తున్నామని అయన అన్నారు... ముందనుకున్న అంచనా ప్రకారం 1100 ఆస్తులు ఈ విస్తరణలో కూల్చవలసి ఉంటుందని భావించామని, కానీ ఎలైన్మెంట్ ను ఇంజనీరింగ్ నవకల్పన ద్వారా సరిదిద్దటం వల్ల ఆ సంఖ్య 900 వరకు తగ్గిందని ఆయన తెలిపారు. వీటిలో ఇప్పటికే 412 ఆస్తులకు సంబంధించిన అవార్డులు జరీ చేశామని, 380 ఆస్తుల కూల్చివేతలు ఇప్పటివరకు పూర్తయ్యాయని ఆయన వెల్లడించారు...



వీటి కోసం రు. 360 కోట్ల నష్టపరిహారం ప్రభావిత ఆస్తుల వారికి చెల్లించామని అన్నారు. ప్రభావిత ఆస్తులను స్వాధీనం చేసుకుంటూ, కూల్చివేతలు చేసి అవశేషాలను తొలగించడంలో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని, వాటిని అధిగమించి పనులు ముమ్మరంగా చేపడుతున్నామని మెట్రో ఎండీ తెలిపారు. ఇక్కడ ఇళ్లు ఒకదానిని ఒకటి ఆనుకుని ఉండటం వల్ల, పైగా ప్రతి కట్టడానికి సంక్లిష్టమైన విద్యుత్ లైన్లు, ఇతర కేబుళ్లు వ్రేలాడుతూ ఉండడంతో వాటిని చాలా అప్రమత్తంగా తొలగిస్తూ ముందుకు వెళ్తున్నామని అన్నారు..

సాధారణ జనజీవనానికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అర్థరాత్రి సమయాల్లో విస్తరణ పనులు ముమ్మరంగా చేస్తున్నామని ఆయన చెప్పారు. మిగిలిన ఆస్తుల స్వాధీనానికి మరియు త్వరితగతిన కూల్చివేతలు పూర్తిచేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్టు ఆయన వెల్లడించారు.

మరో వైపు మెట్రో నిర్మాణ పనులు ప్రారంభించడానికి వీలుగా చర్యలు చేపట్టామని మెట్రో ఎండీ తెలిపారు. ఈ కారిడార్ లో వచ్చే పిల్లర్ల ఏర్పాటుకు తగిన స్థలాలను గుర్తించి వాటిని మార్కింగ్ చేసే పని ప్రారంభం అయిందని ఆయన తెలిపారు. వయాడక్ట్ ను నిలిపే పిల్లర్ల మధ్య 25 మీటర్ల (సుమారు 82 అడుగులు) దూరం ఉంటుందని ఆయన చెప్పారు. మెట్రో స్తంభాలు, స్టేషన్లు వచ్చే చోట భూసామర్థ్య పరీక్షల కోసం ఏజెన్సీని నియమించామని, త్వరలో భూసామర్థ్య పరీక్షలు కూడా చేపడతామని ఆయన వెల్లడించారు.

చారిత్రక, ఇతర సున్నిత కట్టడాలకు అంతరాయం కలగకుండా, పిల్లర్ మరియు మెట్రో స్టేషన్ల స్థానం నిర్ణయించేందుకు DGPS సర్వే నిర్వహించామని ఆయన తెలిపారు. నిర్మాణ సమయంలో సర్వే సులభంగా జరిగేలా భూమిపై తాత్కాలిక బెంచ్ మార్క్ (TBM) లొకేషన్లు నిర్ణయించినట్టు ఆయన స్పష్టం చేశారు. పిల్లర్లు, స్టేషన్లు వచ్చే ప్రాంతాల్లో భూగర్భ మురుగునీటి లైన్లు, మంచినీటి లైన్లు, వరద నీటి డ్రైన్లు, పైన వేలాడే విద్యుత్ లైన్లు తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశానుసారం విద్యుత్ లైన్లను అండర్ గ్రౌండ్ కేబుళ్లు గా మారుస్తామని తెలిపారు.

ఇందుకోసం వాటర్ బోర్డు, జీహెచ్ఎంసీ, టీజీ ఎస్పీడీసీఎల్ విభాగాల నుండి వచ్చే కొద్ది రోజుల్లో అంచనాలు సమర్పించవలసిందిగా కోరామని ఆయన చెప్పారు. ఆయా శాఖల అధికారులతో మెట్రో అధికారులు రేయింబవళ్లు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తూ ముఖ్యమైన యుటిలిటీస్ ని గుర్తించే పని చేపట్టారని ఎన్ వి ఎస్ రెడ్డి తెలిపారు.

## ఎన్నికల సంఘం పిలుపు...
# ఢిల్లీకి కేటీఆర్ బృందం

- ఆగస్టు 5న ఈసీఐ సమావేశానికి హాజరుకానున్న బీఆర్ఎస్
- కేటీఆర్ నేతృత్వంలో ఢిల్లీకి వెళ్లనున్న ప్రతినిధి బృందం
- ఎన్నికల సంస్కరణలు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై చర్చ
- బీఆర్ఎస్ పెండింగ్ వినతులపైనా చర్చించే అవకాశం
- ఓటర్ల జాబితా సవరణ వివాదం నేపథ్యంలో భేటీకి ప్రాధాన్యత

**హైదరాబాద్ ఆగస్టు 03(సిద్దిపేట పవర్):**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని ఒక ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఢిల్లీ పర్యటనకు సిద్ధమైంది. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ఏర్పాటు చేసిన కీలక సమావేశంలో పాల్గొనేందుకు ఈ బృందం ఢిల్లీకి వెళ్లనుంది. రాజకీయ పార్టీలతో ఈసీఐ నిర్వహించనున్న ఈ భేటీ ఆగస్టు 5వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో జరగనుంది.

ఈ సమావేశానికి హాజరుకావాల్సిందిగా బీఆర్ఎస్ పార్టీకి ఎన్నికల సంఘం కార్యదర్శి అశ్వనీ కుమార్ మోహాల్ అధికారికంగా లేఖ పంపారు. తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి ద్వారా కూడా బీఆర్ఎస్ అధ్యక్షుడికి సమాచారం అందించారు. కేటీఆర్ నాయకత్వంలోని ఈ బృందంలో పార్టీ సీనియర్ నేతలు, మాజీ పార్లమెంట్ సభ్యులు ఉండనున్నారు. రాజ్యసభలో బీఆర్ఎస్ పక్ష నేత కేఆర్ సురేశ్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీలు బోయినపల్లి వినోద్ కుమార్, బాల్క సుమన్, పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు.

ఈ సమావేశంలో ప్రధానంగా ఎన్నికల సంస్కరణలు, వివిధ పార్టీలు సమర్పించిన వినతులు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) వంటి కీలక అంశాలపై చర్చ జరగనుంది. బీఆర్ఎస్ పార్టీ గతంలో ఇచ్చిన వినతులు కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది.

దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో రాబోయే ఎన్నికల నేపథ్యంలో ఈ సమావేశానికి రాజకీయంగా ప్రాధాన్యత ఏర్పడింది. ముఖ్యంగా బిహార్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్) డ్రైవ్‌పై వివాదం నడుస్తున్న తరుణంలో ఈ భేటీ జరగడం గమనార్హం. ఇదే అంశంపై కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలు పార్లమెంటు ఉభయ సభలను స్తంభింపజేస్తూ, చర్చకు పట్టుబడుతున్నాయి. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ఈ వ్యవహారంపై ఆగస్టు 5న బెంగళూరులో నిరసన చేపట్టనున్నారు. ఈ రాజకీయ పరిణామాల మధ్య బీఆర్ఎస్ బృందం ఈసీఐ సమావేశానికి హాజరుకావడం ఆసక్తికరంగా మారింది.



# చుక్క నీరు వదలం

- రాజకీయాల కంటే రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం
- ఏపీ కుట్రలు, కుతంత్రాలను అడ్డుకుంటాం
- బనకచర్ల పాపం ముమ్మాటికి బీఆర్ఎస్‌దే
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**ఖమ్మం, ఆగస్టు 03(సిద్దిపేట పవర్):**

తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన సాగునీటి వాటాలో ఒక్క చుక్క నీటిని కూడా వదులుకోబోమని, తమకు రాజకీయాల కంటే రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బనకచర్ల పాపం బీఆర్ఎస్‌దేనని, ఏపీ ప్రభుత్వం పన్నుతున్న కుట్రలు, కుతంత్రాలను అడ్డుకుని తీరుతామన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం కమలాపురం గ్రామంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో రూ.10 కోట్లతో నిర్మించ తలపెట్టిన 10వేల మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో 5.91 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న గోదాంలు రైతులకు అందుబాటులో ఉండేవని, తాము అధికారంలోకొచ్చిన ఏడాదిన్నర వ్యవధిలోనే కొత్తగా 10.75 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న గోదాంలను నిర్మించామని గుర్తు చేశారు. అన్నదాతల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి మా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదన్నారు. అందుకే, దేశంలోనే వరిని అత్యధికంగా పండించే రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని పేర్కొన్నారు.

**ఉమ్మడి ఏపీలో తెలంగాణకు తీవ్ర అన్యాయం**

ఉమ్మడి ఏపీలో సాగునీటి రంగంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని, అందుకే, సబ్బండ వర్గాలు కొట్లాడి ప్రత్యేక రాష్ట్రాన్ని తెచ్చుకున్నామన్నారు. ఇప్పుడు కూడా మన రాష్ట్రంపై అవే కుట్రలు జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి, వాటిని సమర్థవంతంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. మన పొరుగు రాష్ట్రం ఏపీ, మన పంట పొలాలు ఎండిపోయేలా అక్రమ ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి సమర్థవంతంగా వాదనలు వినిపించడం వల్లే బనకచర్ల ప్రాజెక్టుకు బ్రేక్ పడిందని చెప్పారు. సాగునీటి రంగ అభివృద్ధికి పదేళ్లలో బీఆర్ఎస్ చేసింది శూన్యమన్నారు. కృష్ణా, గోదావరిపై గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన ప్రాజెక్టులే మన పంట పొలాలకు నీళ్లందిస్తున్నాయని, వాళ్ల హయాంలో ఒక్కటంటే ఒక్కటి పనికొచ్చే ప్రాజెక్టును కట్టలేదని విమర్శించారు. రూ.లక్ష కోట్లు వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం వల్ల ఒక్క ఎకరాకు కూడా నీళ్లందడం లేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు మాపై విమర్శలు చేయడం మాని, అసలు విషయాలను తెలుసుకోవాలని సూచించారు. అప్పుడు పోలవరం కడుతుంటే చోద్యం చూశారు. బనకచర్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతుంటే పట్టించుకోలేదు. నీళ్లు సముద్రం పాలవుతున్నా పట్టనట్లుగా వ్యవహరించారు. పైగా, అప్పటి ఏపీ పాలకులకు రెడ్ కార్పెట్‌తో స్వాగతం పలికి రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టారన్నారు.

**విభజన హామీలో లేకపోయినా**

విభజన చట్టంలో లేకపోయినా ఆర్డినెన్స్ ద్వారా 7 మండలాలను ఏపీలో కలుపుతుంటే స్పందించలేదని విమర్శించారు. తెలంగాణకు పట్టిన శాపం బీఆర్ఎస్ పార్టీ అని, గత పదేళ్లలో జరిగిన తప్పులను ఇప్పుడు తాము ఒక్కొక్కటిగా సరిదిద్దుతున్నామన్నారు. కృష్ణా, గోదావరి నీటిని సద్వినియోగం చేసుకుని రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు నీళ్లందించేలా పకడ్బందీ కార్యాచరణతో ముందుకెళ్తున్నామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్క దిద్దుతూనే, సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రాజెక్టులను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.





# సైబర్ నేరాలపై పెద్ద ఎత్తున ఆపరేషన్.. 228 మంది అరెస్ట్

మొదటిపేజీ తరువాయి

చెందినవని విచారణలో బయటపడింది. ఇప్పటివరకు వీరు కలిపి సుమారు ₹92 కోట్లు మోసం చేసినట్లు దర్యాప్తులో తేలింది.

సైబర్ నేరాల్లో పలు రకాల మోసాలకు పాల్పడిన ఈ నిందితుల్లో ప్రైవేట్ ఉద్యోగులు, విద్యార్థులు, సాఫ్ట్వేర్ ఇంజనీర్లు, బ్యాంక్ ఉద్యోగులు కూడా ఉన్నారని అధికారులు వెల్లడించారు. ఫేక్ కాల్ సెంటర్ల పేరుతో అమెరికా పౌరులను టార్గెట్ చేస్తూ మోసాలు చేసిన గుజరాత్ ముఠాలో 63 మందిని అరెస్ట్ చేశారు. అదే విధంగా సూరత్‌ను కేంద్రంగా చేసుకుని పనిచేసిన మరో ముఠాలో 20 మందిని అదుపులోకి తీసుకున్నారు.

ఇన్వెస్ట్మెంట్ మరియు జాబ్ ఫ్రాడ్ కేసులు, ఆన్లైన్ ట్రేడింగ్ మోసాలు, డిజిటల్ అరెస్ట్ నేరాలు, ఇతర సైబర్ నేరాల్లో కూడా పలువురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అదనంగా, ఈ ఏడాది ఆన్లైన్లో లైంగిక వేధింపుల కేసుల్లో 15 మందిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వివరించారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రజలకు హెచ్చరిక జారీ చేస్తూ, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది.




# గజ్వేల్ లో నూతన రేషన్ కార్డుల పంపిణి

**ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :** గజ్వేల్ నియోజకవర్గంలోని వర్గల్ గజ్వేల్ జగదేవపూర్ మార్కుక్ ములుగు మండలాల్లో నూతన రేషన్ కార్డులు పంపిణి కార్యక్రమనికి ముఖ్యతిధిగా ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి హాజరై వారీ చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వల చేసి రేషన్ కార్డులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూకాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు అవుతుందని నిరుపేద ప్రజలకు నూతన రేషన్ కార్డులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వదని అన్నారు. బీ ఆర్ యస్ హయాంలో పది సంవత్సరాలు అధికారంలో ఉన్నా ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేని దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా కు 26 వేల రేషన్ కార్డులు మంజూరు కాగా గజ్వేల్ నియోజకవర్గానికి 13 వేల మంది రేషన్ కార్డు మంజూరైన్నాయని అన్నారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్లల్లో ఎక్కడ కూడా పెండింగ్ లో లేకుండా చూడాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు కు 6వందల స్కెర్ పిట్లు మాత్రమే ఉండాలని లబ్ధిదారులు ఒక్క స్కెర్ పిటు ఎక్కువ ఉన్నా లీడ్డరు కూడా ఏమి చేయలేని దుస్థితి ఉందని పేర్కొన్నారు. కలెక్టర్ గాని అధికారులు కూడా ఏమి చేయలేని పరిస్థితులు ఉన్నాయని అన్నారు. మంత్రి అయినా నేను కూడా ఏమి చేయలేని పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం జిల్లా కలెక్టర్ హైమవతి అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్ లో యసి కమిషన్ చైర్మన్ బుర్ర నర్సయ్య ఎమ్మెల్యే యాదవ రెడ్డి మాజీ ఎమ్మెల్యే తూముకుంటా నర్సారెడ్డి ఏఎంసీ చైర్మన్ వంటర్ నరేందర్ రెడ్డి ఆర్ డిఓ చంద్ర కళ కొండపోచమ్మ చైర్మన్ అను గీత ఎంపీడీఓ రామిరెడ్డి యం ఆర్ ఓ నిర్మల డిప్యూటీ తహసీల్దార్ రఘురారెడ్డీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి మాజీ సర్పంచ్ కప్పర భాను ప్రకాష్ రావు సర్పంచులు ఎంపీటీసీలు కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**BRR ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్ రెడ్డి అందచేత**

**కొమురవెల్లి, ఆగస్టు 3 (సిద్దిపేట పవర్)**కొమరవెల్లి మండలంలోని ఐనాపూర్ గ్రామానికి చెందిన సురగోని నర్సమ్మ ఈ రోజు అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న BRR చైర్మన్ బొంగు రాజేందర్ రెడ్డి ఆ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం 5000/ రూపాయలు ఆర్థిక సహాయం అందించి, భరోసా కల్పించారు.ఈ సందర్భంగా రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ BRR ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమంలో కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బూరుగు స్వామి గౌడ్, మెరుగు కృష్ణ, పచ్చిమడ్ల స్వామి గౌడ్, గోపాల్ రెడ్డి, బూరుగు శ్రీనివాస్, సుధాకర్, నరేష్, దుర్గ రెడ్డి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు

## అనాథలకు దుప్పట్లు, దుస్తులు, ఔషధాలు పంపిణి

**సికింద్రాబాద్, ఆగస్టు 03 ( సిద్దిపేట పవర్):**

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో రోడ్ల పక్కన ఫుట్ పాత్ ల మీద జీవనం సాగిస్తున్న అనాథలు, నిరాశ్రయులు, సంచార జాతుల వారికి స్కై ఫౌండేషన్ నిర్వాహకులు అండగా నిలిచారు. వారికి దుస్తులు, దుప్పట్లు, బిస్కెట్ ప్యాకెట్స్ పంపిణి చేశారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వివిధ రుగ్మతలతో బాధపడుతున్న వారిని గుర్తించి ఔషధాలను కూడా అందించారు. ఈ కార్యక్రమములో ప్రెసిడెంట్ డాక్టర్. వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ. పావని, ఫౌండేషన్ సేవాసభ్యులు పాల్గొన్నారు.



## అక్రమంగా తిన్న గొర్రెలను డబ్బులను కక్కించాలి.

**GMPS రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవిందర్**

గత ప్రభుత్వ హయాంలో గొల్ల కురుమల సంక్షేమానికి ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పథకంలో అక్రమంగా తిన్న గొర్రెల డబ్బును కక్కించాలని గొర్రెలు మేకల పెంపకందార్ల సంఘం(GMPS) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవిందర్ డిమాండ్ చేశారు.

ఈ రోజు సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో GMPS మూడో జిల్లా మహాసభ జిల్లా కార్యదర్శి ఆలేటి యాదగిరి అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ఉడుత రవీందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గత ప్రభుత్వం గొల్ల కురుమలను కోటేశ్వరరావు చేస్తామని ప్రవేశ పెట్టిన గొర్రెల పంపిణీ పథకంలో గొల్ల కురుమలకంటే ఎక్కువగా కొంత మంది పశుసంవర్ధక శాఖ అధికారులు, దళారులు లాభపడ్డారు. అవినీతిని అరికట్టాలని GMPS ఆధ్వర్యంలో అనేకసార్లు విన్నవించినా పట్టించుకోలేదు. గతంలో ACB విచారణలో 700 కోట్లు అవినీతి జరిగినట్లు ప్రకటించగా, ప్రస్తుతం ED వెయ్యి కోట్ల అవినీతి జరిగినట్లు ప్రకటించింది. ఈ కేసుల విచారణ మరింత వేగవంతం చేసి అన్ని జిల్లా, మండల స్థాయిలో పూర్తిస్థాయిలో వివరాలు రాబట్టాలని కోరారు. సమగ్ర విచారణ జరిపితే మరిన్ని కోట్ల అవినీతి బయటపడే అవకాశం ఉందని తెలిపారు. అధికారులు, దళారులు గొల్ల కురుమల డబ్బులను పందికొక్కుల్లా మెక్కారని ఆ అవినీతి డబ్బును వెంటనే కక్కించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి సాకుతో గొర్రెల పంపిణీ పథకాన్ని పక్కకు పెట్టే కుట్ర చేస్తుంది. అది గనుక జరిగితే గొల్లకురుమలు ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ ప్రభుత్వం రెండు సంవత్సరాలుగా కనీసం నట్టల నివారణ మందులు ఇవ్వడంలేదు. అనేక ప్రమాదాల్లో గొర్రెలు మరణించినప్పుడు ఇన్సూరెన్స్ కల్పించడంలేదు. 50 సంవత్సరాలు నిండిన పెంపకందార్లకు ఐదువేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ గడ్డం కృష్ణ మాట్లాడుతూ గొల్ల కురుమలు ప్రతి ఒక్కరూ తమ పిల్లల్ని ఉన్నత చదువులు చదివిపియాలని అన్ని రంగాలలో రాణించాలని కోరారు. ఈ మాసభలో ఏగుర్ల ఎల్లయ్య,బైతి శేఖర్, దాసరి కనకయ్య, బర్మ కొమురయ్య, ఈరు లింగయ్య, కొమురెల్లయ్య, బెడిదే బాల మల్లు , బెడిదే కొమరయ్య, వాసూరి స్వామి, ఆలేటి ఆంజనేయులు, వేల్పుల రాజు, ఇరుమల కుమార్ అల్ల శ్రీకాంత్, ప్రశాంత్, బోడపట్ల సత్తయ్య, తుప్పతీ కనకయ్యల తోపాటు గొల్ల కురుమల పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




## బోయిగూడలో ఘనంగా బోనాల ఉత్సవాలు

**1972 లో నిర్మించిన శ్రీనల్లపోచమ్మ ఆలయానికి బోనాల శోభ**

**సికింద్రాబాద్, ఆగస్ట్ 03 ( సిద్దిపేట పవర్) :**

న్యూ బోయిగూడలోని కళారంగ్ కాలనీలో ఉన్న శ్రీ నల్ల పోచమ్మ ఆలయంలో ఆదివారం ఘనంగా శ్రావణ మాస బోనాల ఉత్సవాలు నిర్వహించారు. భక్తితో కుటుంబ సమేతంగా ప్రతి ఇంటి నుండి దప్పు చప్పుళ్ళు, భాజభజంత్రీలతో ఊరేగింపుతో వచ్చి బోనం సమర్పించారు. రాత్రి నిర్వహించిన అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపులో వేషధారణలు, పోతరాజుల నృత్యాల ఆకట్టుకున్నాయి. తీన్మార్ డ్యాన్సులతో చిన్నా, పెద్దా చేసిన సందడితో న్యూ బోయిగూడ పరిసరాలు దద్దరిల్లాయి.



1972 లో నిర్మించిన ఈ పురాతన ఆలయంలో అమ్మవారిని భక్తుల కోరికలు నెరవేర్చే తల్లిగా కొలుస్తున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు గణేష్, ప్రవీణ్, వెంకట్, జితేందర్, రాజు, మురళీ, కృష్ణ, నర్సింగ్ రావు, గోవర్ధన్, ప్రభు, నరేందర్, తెలిపారు. వందలాది మంది భక్తుల రాకతో ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి.



## ఆలయ భూములను రక్షించండి

**కొమురవెల్లి, ఆగస్టు 3 (సిద్దిపేట పవర్)**

భారతీయ జనతా పార్టీ కొమురవెల్లి మండల అధ్యక్షురాలు బూర్గోజు స్వరూప కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థాన కార్యనిర్వాహక అధికారిని అన్నపూర్ణ ని కలిసి రాబోయే కళ్యాణం వరకు క్యూ కాంప్లెక్స్ భవన నిర్మాణం 50 గదుల సత్రం మరియు సూతమాన్ గుండు పైన ఉన్న డమరుక నిర్మాణం అందుబాటులోకి తీసుకురావాలని మల్లన్న ఆలయ భూముల పరిరక్షణకు గుడి దగ్గర ఉన్న విలువైన ఆలయ భూములకు శాశ్వత ప్రతిపాదికన ప్రహరి గోడ నిర్మించి తగిన చర్యలు చేపట్టాలని వినతి పత్రం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బొడుగం కృష్ణారెడ్డి మండల ఉపాధ్యక్షులు ఈగ కనకయ్య మద్దికుంట కరుణాకర్ మండల కార్యదర్శులు తలారి నాగరాజు కొంతం రాజు శక్తి కేంద్ర ఇన్చార్జి గొల్లపల్లి మల్లికార్జున్ మహిళ మోర్చా మండల అధ్యక్షురాలు బుడిగే బాలమని బూత్ అధ్యక్షులు స్వాములపల్లి శ్రీనివాసచారి పిన్నింటి ముకుందా రెడ్డి మహిళా నాయకురాలు కావేటి కనకమ్మ భాగ్యమ్మ పద్మ కళమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ ల రాజ్యాధికారం సాధించే వరకు విశ్రమించేదే లేదు

- **మన ఆలోచన సాధన సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీ మంగిళిపల్లి శంకర్ గంగపుత్ర**
- **జాతీయ బీసీ సంక్షేమ సంఘం సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిసె ప్రభు గంగపుత్ర**

**సిద్ది పేట నియోజకవర్గం చిన్న కోదూరు** మండల కేంద్రంలో జిల్లా ఇంచార్జి గుడిసె ప్రభు నేతృత్వంలో జరిగిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో మన ఆలోచన సాధన సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీ మంగిళిపల్లి శంకర్ గంగపుత్ర మాట్లాడుతూ బీసీల చైతన్యం రాజ్యాధికారమే లక్ష్యంగా గత ఏప్రిల్ 15న హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో పురుడు పోసుకున్న మన ఆలోచన సాధన సమితి బీసీ ఉద్యమాన్ని గ్రామ స్థాయికి తీసుకెళ్ళడమే ధ్యేయంగా ప్రథమంగా రాష్ట్రంలోని 37 నియోజకవర్గాలను ఎంపిక చేసుకుని,ఆ నియోజకవర్గాలకు సంబంధించిన మండల కేంద్రాలలోకి,గ్రామాలలోకి విస్తృతంగా బీసీ భావజాల వ్యాప్తి చేయడం కోసం గ్రామ బాట కార్యక్రమం తీసుకుని, గ్రామ బాటలో భాగంగా గత జూన్ 15 న రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడత మన ఆలోచన సాధన సమితి (మాస్)జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. చాలా అద్భుతమైన స్పందన బీసీ వర్గాల నుండి,మేధావి వర్గం నుండి రావడం గ్రామీణ బీసీ కులాలలో చాలా పెద్ద ఎత్తున బీసీ భావజాలం ఎక్కించడానికి చేసిన చేసిన కృషి విజయవంతం ఐన నేపథ్యంలో మలి విడత గ్రామ బాట కార్యక్రమాలను తీసుకుని నేడు 350 కిపైగా సెంటర్లలో మన ఆలోచన సాధన సమితి జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.అందులో భాగంగా ఈరోజు చిన్న కోదూరు మండల కేంద్రంలో మరియూ సిద్దిపేట ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ప్రాంగణంలో జరిగిన జెండా ఆవిష్కరణ కార్యక్రమాలలో పాల్గొని ప్రసంగించారు .ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు పూస రవి ,దువ్వల శ్రీకాంత్, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గుడిసె లక్ష్మణ్, బీసీఏ కులాల సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కంపరి కనకయ్య బిసి సంఘం సభ్యులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## మంద కృష్ణ మాదిగ ను కలసిన బీజేపీ జిల్లా అధ్యక్షులు బైరి శంకర్, గజ్వేల్ మాజీ మునిసిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్



**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మ శ్రీ మందకృష్ణ మాదిగ గజ్వేల్ పట్టణానికి వికలాంగుల సమస్యలపై జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా విచ్చేసిన వారిని బిజెపి సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్, గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడి పల్లి భాస్కర్ తో కలిసి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.ఈ కార్యక్రమంలో సిద్దిపేట కౌన్సిలర్ బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు వేణు గోపాల్ సిద్దిపేట జిల్లా బిజెపి కౌన్సిల్ సభ్యులు చెప్పియాల వెంకట్ రెడ్డి మాజీ కౌన్సిలర్ అనంతోజు రామచంద్ర చారి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలకు వయసుతో సంబంధం లేదు...

- **ఆరోగ్యవంతమైన జీవితానికి ఆటలు ఎంతో అవసరం**
- **క్రీడా పోటీలను ప్రారంభించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్**

**సికింద్రాబాద్, ఆగస్ట్ 03 ( సిద్దిపేట పవర్ ) :**



క్రీడలకు వయస్సుతో సంబంధం లేదని, ఆరోగ్య వంతమైన జీవితానికి క్రీడలు ఎంతో అవసరమని.. ఆటలతో మానసిక ఉల్లాసం కూడ కలుగుతుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలోని జింఖానా గ్రౌండ్స్ లో మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ స్టేట్ ఛాంపియన్ షిఫ్-2025 క్రీడా పోటీలను ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రారంభించారు. 30 ఏండ్ల వయస్సు పైబడిన పురుషులు, మహిళలకు నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన క్రీడాకారులను ఎమ్మెల్యే అభినందించారు. పోటీల అనంతరం పలు క్రీడాల్లో గెలుపొందిన విజేతలకు మెడల్స్ అందచేశారు. క్రీడలను ప్రొత్సహిస్తున్న నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ వైస్ ప్రెసిడెంట్ జంపన ప్రతాప్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జగదేవపూర్ లో కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బోనాల పండుగ

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :** జగదేవపూర్ మండల కేంద్రంలో కుమ్మరి సంఘం మండల అధ్యక్షులు దాచారం కనకయ్య, సంఘం పెద్దమనిషి దాచారం యాదగిరి, దుబ్బాక కనకయ్య దాచారం బాల్నర్సయ్య, దాచారం శ్రీను , జహంగీర్, మహేష్, నాగరాజు శేఖర్, ఎల్లయ్య అంజయ్య , దాచారం మల్లేశం, నర్సింలు ఆధ్వర్యంలో శ్రావణమాసం రెండవ వారం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలను డప్పు వాయిదాల మధ్య ఊరేగించారు అమ్మవారికి బోనాలు నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.వర్షాలు సమృద్ధిగా చూసి పంటలు బాగా పండాలని గ్రామస్తులు ఆయురారోగ్యాలతో ఉండాలని పాడి పంటలు పండాలని పశు పక్షదులు, పిల్లా పాపలు సల్లంగా ఉండాలని కోరుతూ ప్రతి ఏడాది పండుగ నిర్వహిస్తామని కుమ్మరి సంఘం గ్రామ పెద్దలు తెలిపారు.ఈ కార్యక్రమం లో కుమ్మరి సంఘం పెద్దలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి వివేక్ ముందు గజ్వేల్ కాంగ్రెస్ పార్టీ లో ఇరు వర్గాల మధ్య ఘర్షణ

- **గజ్వేల్ కాంగ్రెస్ పార్టీ లో రోజు రోజుకు వర్గ పోరు ముదురుతున్న మాటాల తూటలు**
- **ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి గడ్డం వివేక్ వేంకట స్వామి**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం** సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ లో వర్గ పోరు రోజు రోజు కు ముదురుతోంది మాటల తూటాలతో కాకుండా ఏకంగా మంత్రి ముందు ఘర్షణ పడ్డారు . సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా బండారు శ్రీకాంత్ రావు వర్గం లో ఉన్న వ్యక్తి గజ్వేల్ ఆత్మకమిటి చైర్మన్ మల్లారెడ్డి కు స్టేజ్ పై కూర్చో బెట్టడం తో ఆగ్రహానికి గురైన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి వర్గం ఆందోళన కు దిగారు . దీనితో రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం ఉద్రిక్తత కు దారి తీయగా జోక్యం చేసుకున్న పోలీసులు ఇరు వర్గాలను కట్టుదిట్టం చేయడం మంత్రి జోక్యం చేసుకోవడం తో గొడవ సద్దుమణిగింది.

